క్లుప్తంగా

తాగునీటి పైప్‌లైన్ లీకేజీ



పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా తాగునీటి పంపింగ్ పైప్‌లైన్ పది రోజుల కిందట లీకేజీ ఏర్పడింది. నీరు వృథాగా పోతున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ నరసింహులు దృష్టికి తీసుకెళ్లగా.. దసరా పండుగ తర్వాత పైప్‌లైన్ లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రేపటి నుంచి 'ఉపాధి' గ్రామసభలు

కణేకల్లు: ఉపాధి హామీ కింద పనులు గుర్తించేందుకు ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. 2026–27 సంవత్సరంలో చేపట్టవలసిన పనులను గుర్తించి ప్రతిపాదనలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. 3న బెణికల్లు, బిదురుకుంతం, బ్రహ్మసముద్రం, 4న గెనిగెర, గోపులాపురం, 6న గరుడచేడు, పూలచెర్ల, కలేకుర్తి, రచ్చుమర్రి, 7న ఉడేగోళం, యర్రగుంట, హనకనహాళ్, 8న కణేకల్లు, ఎస్.హనుమాపురం, 9న జక్కలవడికి, మాల్యం, సొల్లాపురం, 10న తుంబిగనూరులో గ్రామ సభలు ఉంటాయన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన తహసీల్దార్



పీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

బొమ్మనహాళ్ (బొకుగుప్ప): మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం తహసీల్దార్ అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు ఇద్దరు సమ్మెలో ఉండటంతో అదనపు వైద్యాధికారిగా శింగనమల సీహెచ్‌సీ నుంచి వైద్యాధికారి అభిలాష్‌ను ప్రభుత్వం నియమించినా ఆయన విధులకు హాజరుకాలేదు. పీహెచ్‌సీలో మొత్తం 18 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం 9 మంది మాత్రమే హాజరు బుక్‌లో అందుబాటులో ఉండటం ఏమిటని తహసీల్దార్ ప్రశ్నించారు. క్యాంపులకు వెళ్లిన వారి వివరాలతో పాటు గైర్హాజరైన వారిపై ఉన్నతాధికారులకు రిపోర్టు పంపుతానని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ మధుసూదన్‌రావు, ఆర్ఐ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో గంగ పూజ



కలశాలతో గంగపూజకు వెళుతున్న మహిళలు, బాలికలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో శాంతినగర్‌లో పెద్ద బన్నీ మహంకాళి గంగపూజ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 కలశాలతో మహిళలు పాలబావి వద్ద గంగపూజ చేసి.. శాంతినగర్‌లోని బన్నీ మహంకాళి ఆలయానికి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపుగా వచ్చారు. భజన బృందం కీర్తనలు, నందికోళ్ళ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



ఉరవకొండ సచివాలయం-4 వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో పింఛన్లు అందక పలువురు వృద్ధులు, వికలాంగులు ఆయా సచివాలయాల వద్ద బుధవారం పడిగాపులు కాశారు. సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లకపోవడంతో పింఛన్‌దారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కనీసం పింఛన్‌దారులకు సమాధానం చెప్పే వారు కూడా కరువయ్యారు.

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

కూడేరు: వ్యవసాయ యంత్రాలు ట్రాక్టర్లు, విడి భాగాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్, ఇరిగేషన్ , హార్వెస్టింగ్ యంత్రాలు, డీజిల్ ఇంజన్లు, కంప్రెసర్లపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడంతో రైతులకు ఊరట లభించిందని తహసీల్దార్ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం కూడేరులో సూపర్ జీఎస్టీ ..సూపర్ గిఫ్ట్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఏఓ శుభకర్‌లు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల రక్షణకే డిజిటల్ బుక్





డిజిటల్ బుక్ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, చిత్రంలో పరిశీలకుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి తదితరులు, హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

- కూటమి నేతల వేధింపులకు భయపడొద్దు
- దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలన్నీ నమోదు
- డిజిటల్ బుక్ పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: కూటమి పార్టీల నాయకుల దాడులు, దౌర్జన్యాలు ఇతరత్రా అక్రమ కేసులతో ఇబ్బందులకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలిచి.. రక్షణ కల్పించేందుకే 'డిజిటల్ బుక్' తీసుకొచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, రాష్ట్ర కార్యదర్శులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, పొరాళ్ల శివకుమార్, కోకుర్తి ఉషారాణి, బీటీపీ గోవిందు, ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్, మండల కన్వీనర్లు గౌని లక్ష్మీ కాంతారెడ్డి, మేకల శ్రీనివాసులు, బ్రహ్మానందరెడ్డి, రామాంజినేయులుతో కలసి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులు, కూటమి నేతల దౌర్జన్యాలకు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కూటమి పాలనలో జరిగిన ప్రతి అన్యాయాన్ని, అరాచకాలను కార్యకర్తలు డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌లో నమోదు చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చినపుడు బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఏడాదిన్నర పాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్యాకేజీ స్టార్ ఏ ఒక్క విషయంలోనూ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదన్నారు. లోకేష్ అమలు చేస్తున్న ఆటవిక 'రెడ్‌బుక్' రాజ్యాంగానికి నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు, నియోజకవర్గ పరిశీలకుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం అడ్డుపెట్టుకుని అరాచకాలకు పాల్పడుతున్న వారు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం

గ్రామ, బూత్‌స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, పార్టీ పరిశీలకుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ ఆఖరునాటికి గ్రామ కమిటీలు పూర్తి చేయాలన్నారు. మండల కన్వీనర్లు ఈ బాధ్యతలు దగ్గరుండి చూడాలన్నారు. ఈ ఆయుధపూజ నుంచే విస్తృతంగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారన్న, చేనేత విభాగం అధ్యక్షుడు నాగప్ప, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చూడముచ్చటగా బొమ్మల కొలువులు



అర్చకులు రామకృష్ణశర్మ, శైలజ దంపతుల ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటవీధిలో దసరా పండుగను పురస్కరించుకుని ఏర్పాటైన బొమ్మలకొలువులు ఆకట్టుకుంటున్నాయి. జంబుకేశ్వరస్వామి ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ, శైలజ దంపతుల ఇంట్లో 500కుపైగా బొమ్మలతో కొలువు ఏర్పాటు చేశారు. తాతల కాలం నుంచి బొమ్మలకొలువు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రధాన అర్చకులు వెంటాచపలపతి, సరస్వతి దంపతుల ఇంట్లోనూ దాదాపు 300కుపైగా బొమ్మలతో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ఆకట్టుకుంటోంది. సంస్కృతి, సంప్రదాయాల్లో బొమ్మలకొలువు ఒకటని, దీంతో పిల్లల్లో ఆనందం, ఉత్సవంతోపాటు సంస్కృతి పట్ల భక్తిభావాలు పెంపొందుతాయని అర్చకులు తెలిపారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

ఉరవకొండ: శరన్నరాత్రుల సందర్భంగా పాతపేటలోని అంగన్‌వాడీ కార్యకర్త శ్వేతనాగు ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. దేవతా ప్రతిమలు, మట్టిబొమ్మలు, అమ్మవారి రూపాల ప్రతిమలు, పండ్లు, చెట్లు లాంటి బొమ్మలను కొలువు తీర్చారు. స్థానికులు బొమ్మల కొలువు చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుందుర్పి: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారన్నారు. ఇందుకు మంగళవారం జంబుగుంపల గ్రామంలో జరిగిన ఘటనే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. జంబుగుంపల గ్రామంలో తమ తండ్రి పొలంలో రస్తా వద్దని వేడుకున్న గొల్ల లక్ష్మీదేవి కుమార్తెను టీడీపీ నాయకుడు రాయుడు జేసీబీకి అడ్డు రావొద్దని ఏకంగా చేయిపట్టి పక్కకు తోసేశాడన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల భార్య, బిడ్డల పట్ల అనుచితంగా ప్రవర్తించడం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ నాగరాజు, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయుడు, ఉపాధ్యక్షులు భీమప్ప, సర్పంచులు అతావుల్లా, జగన్, వార్డు సభ్యుడు మంజు, సర్పంచ్ రామ్మూర్తి, వార్డు సభ్యుడు మంజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, ఐటీ వింగ్ జిల్లా నాయకులు నరేష్, జంబుగుంపల మహేంద్ర, డీలర్ నాగరాజు, దళిత నేత ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతికి అసలు కారకులపై చర్యలు చేపట్టాలి

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో ఐదేళ్ల బాలుడు వైద్యం అందక మృతి చెందిన ఘటనలో అసలు కారకులపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల సంఘం నేత నవాబ్ జాకీర్‌హుసేన్ డిమాండ్ చేశారు. బుధవారం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో బాలుడి మృతి ఘటనపై వివరాలను అడిగి ఆరాతీశారు. ఆయనతో పాటు ఐఎంఎం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఆల్ ఇండియా బహుజన్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రదీప్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోకులమూర్తి మాట్లాడుతూ చాబాలకు చెందిన ఐదేళ్ల బాలుడి మృతిపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ అకారణంగా డ్యూటీ డాక్టర్ ఇస్మాల్‌పై చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. బాలుడు ప్రభుత్వాస్పత్రికి రాకముందే ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ చౌదరి తన ప్రైవేట్ క్లినిక్‌లో చికిత్స అందించాడన్నారు. ఆ తరువాత బాలుడి పరిస్థితి విషమించడంతో ప్రభుత్వాస్పత్రికి పంపాడన్నారు. ఆ తరువాత అక్కడ ఉండే స్టాఫ్ నర్సు డ్యూటీ డాక్టర్‌కు సమాచారం ఇవ్వకుండా తానే వైద్యం అందించడంతో బాలుడి మృతి చెందాడన్నారు. ఘటన పై సమగ్రంగా విచారణ చేపట్టాలని డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం

బొమ్మనహాళ్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఉద్దేహాళ్‌లోని జమ్మిచెట్టు వద్ద దుర్గమ్మకు పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ప్రత్యేక పూలమాలలతో అమ్మవారికి, జమ్మిచెట్టుకు అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం ఉద్దేహాళ్ యూత్ సభ్యులు విశ్వనాథ్‌రెడ్డి, కురుబ రాజా, వన్నూరుస్వామి, చాకలి రవి, కావలి శ్రీనా, వంశీ, రామకృష్ణ, రవిచంద్ర, శశాంక్, ఈశ్వర్, సతీష్‌రెడ్డి, చరణ్ తదితరుల ఆధ్వర్యంలో రెండు వేలమంది భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు అండగా లియాఫీ



సంబరాలు చేసుకుంటున్న ఎల్ఐసీ ఏజెంట్లు

రాయదుర్గంటౌన్: స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో బుధవారం లియాఫీ (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. లియాఫీ యూనియన్ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎల్ఐసీ ఏజెంట్లకు అండగా లియాఫీ అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్‌నాయక్, అసిస్టెంట్ బీఎం ధర్మతేజ, డీఓలు శ్రీనివాసులు, హరిష్, రవికుమార్, యూనియన్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, నాగరాజు, నిసార్, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శెట్టూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ పద్మావతి అన్నారు. బుధవారం మండలంలోని మాకోడికి, చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. పోషణ మహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు శకుంతలమ్మ, రామాంజినమ్మ, వన్నూరక్క, శ్రీదేవి, గాయిత్రి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దసరా సందడి



ఉరవకొండలో పండుగ సామగ్రి కొనడానికి వచ్చిన ప్రజలతో కిక్కిరిసిన టవర్‌క్లాక్ ప్రాంతం

సాక్షి బృందం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో దేవీ నవరాత్రుల శోభ సంతరించుకుంది. బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఇదే రోజు ఆయుధ పూజను అంతటా ఘనంగా చేశారు.



ఉరవకొండ: మహిషాసుర మర్దినిగా ఉరగాద్రి చౌడేశ్వరి



రాయదుర్గంలో మహిషాసుర మర్దినిగా కన్యాకపరమేశ్వరి



కల్యాణదుర్గంలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత

ముగిసిన క్రికెట్ టోర్నీ



ట్రోఫీతో విజేతలు

బ్రహ్మసముద్రం: ముప్పలకుంట గ్రామంలో దసరా సందర్భంగా ఐదు రోజులుగా సాగుతున్న క్రికెట్ టోర్నీ(ఎంపీఎల్ సీజన్ -5) బుధవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్ ముప్పలకుంట ఫైర్ బ్లడ్స్ జట్టు, ముప్పలకుంట ఫైటర్స్ జట్ల మధ్య జరిగింది. ఇందులో ముప్పలకుంట ఫైర్ బ్లడ్స్ జట్టు, ముప్పలకుంట ఫైటర్స్ జట్టుపై ఘన విజయం సాధించింది. నిర్వాహకులు విన్నర్స్‌కు రూ.20 వేలు నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు.

సంక్షిప్త సమాచారం

మూడో రోజూ వైద్యుల సమ్మె



వైద్యులు లేక ఖాళీగా ఉన్న సీటు

రాయదుర్గంటౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె మూడో రోజు బుధవారం కూడా కొనసాగింది. ఓపీ సేవలను పూర్తిగా నిలిపివేస్తూ అత్యవసర సేవలు మాత్రమే మినహాయిస్తున్నట్లు గుమ్మఘట్ట పీహెచ్‌సీ వైద్యుడు రమేష్ తెలిపారు. నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీల వైద్యులు సమ్మె బాట పట్టారు. నిరసనలో భాగంగా బుధవారం అనంతపురంలో జరిగిన నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు.

వరుస చోరీలతో బెంబేలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో వరుస చోరీలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే జంకుతున్న పరిస్థితి నెలకొంది. సెప్టెంబర్ 29న అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణంలోని చర్చి ఏరియాలో ఒకే రోజు మూడిళ్లలో చోరీలు జరిగాయి. గంగానాయక్ అనే వ్యక్తి ఇంట్లో రూ.50 వేల నగదు, 3 పట్టుచీరలు, కవితాబాయి ఇంట్లో రూ.20 వేల నగదు, మోహన్ అనే వ్యక్తి ఇంట్లో రూ.4 వేల నగదు ఎత్తుకుపోయారు. తాజాగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత పట్టణ శివారు కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని దుకాణంలో చోరీ జరిగింది. పైకప్పు రేకులు తొలగించి లోపలికి ప్రవేశించి క్యాష్ బాక్స్‌లోని రూ.3 వేలు నగదు, సిగరెట్లు, ఇతర సరుకులు అపహరించుకుపోయినట్లు బాధితుడు నాగరాజు వాపోయాడు. చోరీల నియంత్రణకు పోలీసులు గస్తీ ముమ్మరం చేసి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పూడికతీత పనులకు ప్రాధాన్యం ఇవ్వండి

కూడేరు: పూడిక తీత, ఫారంపాండ్ల పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులపై అవగాహన కల్పించారు. 3 నుంచి మండలంలోని అన్ని పంచాయతీల్లో షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలను నిర్వహించాలన్నారు.

జన ఔషధి దుకాణం ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన ఔషధి దుకాణాన్ని బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రజలకు తక్కువ ధరల్లో మందులు అందజేయాలనే ఉద్దేశంతో ఈ దుకాణం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞాన సుధ, వైద్యులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనులు కల్పించకపోతే మెమోలిస్తాం

వజ్రకరూరు: గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించకపోతే మెమోలు జారీ చేస్తామని ఏపీఓ విమల హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు



వై.శివరామిరెడ్డి



వై.విశ్వేశ్వరరెడ్డి



తలారి రంగయ్య



మెట్టు గోవిందరెడ్డి

ఉరవకొండ: జగన్మాతా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి. దసరా పండుగ ప్రతి ఒక్కరి ఇంట్లో సుఖ సంతోషాలు నింపాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, పార్టీ పీఏసీ సభ్యులు వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చి వారి కష్టాలు తొలగిపోవాలని కోరుకుంటున్నామన్నారు.

కళ్యాణదుర్గం: ప్రజలు విజయదశమి పండుగను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఆయన నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గామాత ఆశీస్సులతో చేపట్టే పనులలో విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులు, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.